# చివరి పిలుపు

అట్లూరి శరత్ బాబు



చిదంబరానికి కొత్తగా వివాహమైంది.

భార్య అరుంధతితోపాటు ఒంగోలులో కాపురం పెట్టాడు. అతను ఉద్యోగం చేస్తున్నది కూడా అక్కడే!

టౌన్‌లో అద్దెకు ఇల్లు దొరక్కపోవడంతో ఊరి పొలిమేరల్లో ఉన్న అయిదెకరాల తోటలో ఏకాంతంగా ఉన్న ఇంటిలో చేరాడు.

ఆ ఇంటిలో రెండు వాటా లున్నాయి.

తాను తీసుకున్న భాగం కాకుండా మరో వాటాను సైతం ఎవరో తీసుకుని అడ్వాన్సు ఇచ్చారని తెలుసుకుని సంతోషించాడు.

తాను ఆఫీసుకు వెళ్లిన సమయంలో ఒంటరిగా ఉండే అరుంధతికి తోడు లభిస్తుం దన్న సంతృప్తే ఆ ఆనందానికి కారణం!

చిదంబరం ఎదురు చూస్తున్న ఆ రోజు రానే వచ్చింది.

అయితే పక్క వాటాలో ఒంటరిగా ఉన్న ఒక వృద్ధురాలు చేరటంతో తీవ్రంగా నిరాశ చెందాడు.

ఆమె పేరు అండాళ్లమ్మ. 70 సంవత్సరాల వయస్సు.

ఆమె చూపుల్లో దిగులు, నైరాశ్యం ప్రతిబింబిస్తాయి.

ఒకరి కొకరు తోడుగా ఉండవచ్చని ఆశించిన అరుంధతి ఆమెను చూస్తూనే ఒక్కసారి భారంగా నిట్టూర్చింది.

అండాళ్లమ్మ కలుపుగోరు మనిషి కాకపోవడంతో అరుంధతిని తిరిగి ఒంటరితనం వేధించసాగింది. అండాళ్లమ్మ ఎప్పుడూ తలుపులు మూసుకుని ఇంట్లోనే ఉండేది. బయట చాలా అరుదుగా కనిపించేది.

"ఏమో అనుకున్నాను - మన పక్కింటి అండాళ్లమ్మ గారికి చాలా గర్వమండోయ్! ఈ రోజు ఫోన్ కూడా పెట్టించుకుంది. పలకరిద్దా మని వాళ్ల ఇంట్లోకి వెళ్లాను. సామాన్లు అవీ బాగానే ఉన్నాయి. అయితే ప్రతిదానికి తన కొడుకు, కూతురులను తెగ పొగుడుతోంది" అంటూ చెప్పింది అరుంధతి.

"తన వాళ్లను గురించి గొప్పలు చెప్పుకోవడం మీ ఆడవాళ్లకు అలవాటేగా!"

"సమయం చిక్కింది కదా అని ఎత్తిపొడుస్తున్నారా? అయినా ఏమిటో ఆమె గారి అతిశయం చూస్తుంటే ఆమెతో మాట్లాడా లనిపించలేదు" అంది అరుంధతి.

"నీ ఇష్టం, అలాగే కానీయ్!"

మరో రోజు చిదంబరం ఆఫీసుకు వెళ్లేందుకు సైకిలు తీస్తుంటే పక్కింట్లోంచి అండాళ్లమ్మ కంఠం వినిపించింది.

"చూడు, బాబూ! సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడు ఈ సరకులు తెచ్చిపెట్టు, నాయనా! ముసలిదాన్ని - వెళ్లి తెచ్చుకునే ఓపిక లేదు" అంటూ అండాళ్లమ్మ ఒక చీటీ అందించింది.

ముసలిదన్న జాలి వల్ల అయితే నేం, ఒంటరిగా ఉంటోం దన్న సానుభూతితోగాని అప్రయత్నంగా ఆ చీటి అందుకున్నాడు.

సాయంత్రం ఆమెకు కావాల్సిన సరకు లన్నిటినీ సైకిల్ మీద జాగ్రత్తగా తీసుకువచ్చాడు.

"మొత్తం అరవై రూపాయ లయ్యాయి. ఇదిగో,

బిల్లు. ఇవిగో సరకులు" అంటూ బుట్టను ఆమెకు అందించాడు.

ఆండాళ్లమ్మ మర్యాద కోసమైనా లోపలకు రమ్మనలేదు. సరకు లున్న బుట్టను లోపలకు తీసుకువెళ్లి పది నిముషాల తర్వాత తిరిగి వచ్చి చిదంబరం చేతిలో అరవై రూపాయ లుంచి, లోపలకు వెళ్లి తలుపులు మూసుకుంది.

చిదంబరానికి ఒళ్లు మండింది.

మరోసారి ఆమెకు చస్తే సహాయం చేయకూడ దని తీర్మానించుకున్నాడు.

కొన్ని రోజులు గడిచాయి. ఆ రోజు చిదంబరం ఆఫీసు నుంచి వచ్చేసరికి అరుంధతి గుమ్మంలోనే ఎదురుచూస్తూ కనిపించింది.

"అమ్మయ్య, వచ్చారా!" అంటూ నిట్టూర్చింది. "మీ రొస్తారు టీ కాద్దామని స్టౌ వెలిగించానో, లేదో గ్యాసు అయిపోయింది. త్వరగా సిలిండర్‌కు ఫోన్ చేయండి" అంది ఆదుర్దాగా.

"ఇప్పు డెక్కడ చావమంటావు?" సైకిల్ స్టాండు వేసి పని వల్ల కలిగిన విసుగుతో అన్నాడు చిదంబరం.

"పక్కింటి మామ్మగా రింట్లో ఫో నుందిగా!"

"ఆవి డింటికా! చస్తే వెళ్లను."

"అయితే వెళ్లి బజారులో టీ తాగి, ఫోన్ చేసి రండి. గ్యాసు రాకుంటే ఈ పూట వంట నా వల్ల కాదు." నిష్కర్షగా చెప్పింది అరుంధతి.

తిరిగి మళ్లీ టౌన్‌కు వెళ్లే ఓపిక లేక, అన్యమనస్కంగానే పక్కింటి తలుపు తట్టాడు.

ఆండాళ్లమ్మ తలుపు తీసింది.

చిదంబరం తన పని చెప్పాడు.

"నాకు ఫోన్ అవసరం లేకున్నా పిల్లలు విన్నారు కాదు. నెలకు నాలుగైదు సార్లు వాళ్ల నుంచే ఫోన్లు వస్తాయి. ఆ భాగ్యానికి ఫో నెందుకు అంటే విన్నారు కాదు. నా మాటలు వినకుండా ఉండలేరట. వాళ్లకు నే నంటే అంత అభిమానం. రా, నాయనా, వచ్చి చేసుకో!" అంటూ పక్కకు తప్పుకుంది.

'బ్రతికానురా, భగవాన్!' అనుకుంటూ దృష్టి సారించాడు.

ఎవరో యువతి ఛాయా చిత్రాలు గోడల నిండా అలంకరించి ఉన్నాయి.


"మామ్మగారూ! ఆవిడ ..." అంటూ నసిగాడు. చిదంబరం.

"నా కూతురు సుందరి. చాలా అందమైంది. దేవతలా ఉంది కదూ! చిన్నతనం నుంచీ లలిత కళల లంటే ప్రాణం. నాట్యంలో మంచి ప్రావీణ్యం ఉంది. ప్రదర్శనలు సైతం ఇచ్చింది. ఎటొచ్చీ వివాహం జరిగాకే మానుకుంది. లేకుంటే ఈపాటికి ప్రపంచ మంతా మారుమోగిపోయి ఉండేది" అన్నది ఆండాళ్లమ్మ. ఆమె ఆ మాటలు అంటుంటే కళ్లలో వింత కాంతులు వెలిగాయి.

"ఇప్పు డెక్కడుంది?" అడిగాడు చిదంబరం.

"మధ్యప్రదేశ్‌లో. భోపాల్ దగ్గర మా అబ్బాయి పెద్ద ఫ్యాక్టరీ పెట్టాడు. కోట్లు గడిస్తున్నాడు. భర్తతోపాటు సుందరీ అక్కడే ఉంటోంది." చెప్పింది ఆండాళ్లమ్మ.

ఆండాళ్లమ్మ కొడుకు గురించి, కూతురు గురించి అంత గొప్పగా చెబుతున్నా వా రెప్పుడూ ఆమె ఇంటికి వచ్చిన పాపాన పోలేదు. ఉత్తరాలు మాత్రం అప్పు డప్పుడూ వస్తూండేవి.




ఉన్నట్లుండి ఒకరోజు ఆమె ఇంటి నుంచి డాక్టర్ రామనాథం రావటం కంటబడింది.

డాక్టరు వెళ్లగానే ఆదుర్దాతో ఆమె ఇంట్లోకి వెళ్లాడు చిదంబరం. "మామ్మగారూ! ఆరోగ్యం బాగాలేదా?" అంటూ అడిగాడు.

"నా ఆరోగ్యాని కేం బాబూ! నిక్షేపంగా ఉంది. ఈ కాలపు డాక్టర్లకే పనీ పాటా లేదు. ఉన్నవీ, లేనివీ చెప్పి కంగారు పెడుతున్నారు. పైగా ఈ డాక్టరు వట్టి డబ్బు మనిషిలా ఉన్నాడు." చెప్పింది ఆండాళ్లమ్మ.


ఇంతలో ఫోన్ మోగింది.

ఆండాళ్లమ్మే వెళ్లి రిసీవర్ అందుకుంది.

"ఓహ్, నువ్వా! అన్ని విషయాల్లోనూ నీకు తొంద రెక్కువ. అలాగే వస్తాను" అని రిసీవర్ పెట్టేసింది.

చిదంబరం వైపు తిరిగి, "మా అమ్మాయి, బాబూ! రేపు ఉదయాన్నే నన్ను నెల్లూరు రమ్మన మంది. మొదట్నుంచీ దానికి తొంద రెక్కువ" చెప్పింది ఆండాళమ్మ.

మరునాటి రోజు చిదంబరం నిద్ర లేచేసరికి ఆమె ఇంటికి తాళం వేసి ఉంది. కూతురును చూడటానికి నెల్లూరు వెళ్లి ఉంటుం దనుకున్నాడు.




ఆ రోజు సాయంత్రం కూతురితో ఆండాళ్లమ్మ ఇంటికి వస్తుందని ఆశించాడు చిదంబరం. సుందరిని స్వయంగా చూడాలన్న కోరికతో కుర్చీ బయట వేసుకుని కూర్చున్నాడు.

అయితే రాలేదు. ఆండాళ్లమ్మ జాడ తెలియలేదు.

మరునాటి రోజు ఆఫీసుకు బయలుదేరుతుండగా తలుపు చప్పుడైతే వెళ్లి తెరిచాడు.

ఎదురుగా డాక్టర్ రామనాథం కనిపించాడు.

"సారీ! మీ కో దుర్వార్త చెప్పాలి. మీ పొరుగున ఉంటున్న ఆండాళ్లమ్మ నిన్న ఉదయం నెల్లూరులో మృతి చెందింది. బస్సు ఎక్కుతూ కాలు జారి పట్టు తప్పి బస్సు కింద పడి మృతి చెందింది."

ఆశ్చర్యపోయాడు చిదంబరం.

"అమెతో పాటు ఆమె కూతురు సుందరి ఉండి ఉంటుంది కదా!" నోరు పెగల్చుకుని అన్నాడు చిదంబరం.

"సుందరా! ఆమె చనిపోయి రెండేళ్లయింది."

"ఏమిటి, డాక్టర్, మీ రంటున్నది?? మొన్న నేను ఉండగానే ఆమె నుంచి ఫోన్ వచ్చిం దని ఆండాళ్లమ్మ నే నుండగానే మాట్లాడిందే!"

"అలాగే చేస్తుంది. ఆండాళ్లమ్మకు కుమార్తె అంటే వల్లమాలిన ప్రేమ. నిజానికి రెండేళ్లక్రితం సుందరి వరదలు వచ్చి నదీ ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఆ విషాదాన్ని ఆండాళ్లమ్మ తట్టుకోలేకుండా ఉంది. సుందరి జ్ఞాపకాలే వెన్నంటి ఉండటంతో ఆమెను ప్రత్యక్షంగా చూస్తున్నట్లు మాట్లాడుతుంది. ప్రతిరోజూ నిద్ర మాత్రలు మింగుతూ పరధ్యానంగా గడుపుతూ మృతి చెందిన సుందరిని తన మాటలలో బ్రతికిస్తూ గడుపుతోంది." వివరించాడు డాక్టరు.

నిశ్చేష్టుడైనాడు చిదంబరం.

ఏమైనా - సుందరి నుంచి ఆండాళ్లమ్మకు చివరి పిలుపు అంది ఉండాలి. అందుకే ఆమె చెంతకు వెళ్లిం దనుకున్నాడు చిదంబరం! ★